క్లుప్తంగా

గండి నిత్యాన్నదానానికి రూ.లక్ష వితరణ


సిద్దారెడ్డి దంపతులకు స్వామి వారి చిత్రపటాన్ని అందజేస్తున్న ముకుందరెడ్డి

చక్రాయపేట: గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో నిత్యం జరిగే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి రు.1,00,116లు విరాళంగా వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి పేర్కొన్నారు. తొండూరు మండలం టి.తుమ్మలపల్లెకు చెందిన అమ్మిరెడ్డి సిద్దారెడ్డి, ఆయన సతీమణి నాగలక్ష్మిలు మంగళవారం ఈమేరకు మొత్తం అందజేశారని ఆయన తెలిపారు.

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టు భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

వేంపల్లి : స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జంతు శాస్త్ర విభాగంలో గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేసేందుకు ఆసక్తిగల అభ్యర్థుల తమ బయోడేటాతో సెప్టెంబర్ 1వ తేదీ ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూకు హాజరు కావాలని ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు తెలిపారు. పీజీలో 55శాతం ఉత్తీర్ణత కలిగి ఉండాలన్నారు.

పెండింగ్ కేసులను వేగంగా పరిష్కరించాలి

నేర సమీక్షలో జిల్లా ఎస్పీ కేకేఎన్.అన్బురాజన్

కడప అర్బన్ : పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా ఎస్పీ కేకేఎన్.అన్బురాజన్ పోలీస్ అధికారులను ఆదేశించారు. నగరంలోని 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో మంగళవారం నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అతి తీవ్రమైన నేరాల దర్యాప్తు పూర్తిచేసి నిందితులపై ఛార్జ్‌షీట్ దాఖలు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకునే ప్రాంతాల్లో వాహనదారులను అప్రమత్తం చేస్తూ సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మహిళలపై నేరాలు, రాబరీ, డెకాయిట్ కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయాలన్నారు. మహిళలు, బాలికల అదృశ్యం కేసులను విచారించి అదృశ్యమైన వారి ఆచూకీ తెలుసుకోవాలన్నారు. గంజాయి, రవాణా విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లాను నాటుసారా రహిత జిల్లాగా మార్చేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులతో కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహించాలన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధానికి పకడ్బందీ చర్యలు చేపట్టడంతో పాటు నిఘా పెంచాలన్నారు. మట్కా, క్రికెట్ బెట్టింగ్, జూదం తదితర అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. ఎస్‌హెచ్‌ఆర్‌సీ, ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఫిర్యాదులపై తక్షణం స్పందించాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్ డూడీ, ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్.ఎస్.ఎస్.వి కృష్ణారావు, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



మహిళా సంరక్షణ కార్యదర్శికి ప్రశంసా పత్రం అందజేస్తున్న ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

ఉత్తమ సేవలకు ఎస్పీ ప్రశంస

వివిధ కేటగిరీలలో అత్యుత్తమ సేవలదించిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ కేకేఎన్. అన్బురాజన్ ప్రశంసాపత్రాలు అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. కడపలోని 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన నేర సమీక్ష కార్యక్రమంలో సాక్ష్యాధారాలతో నేర నిరూపణకు కృషి చేసిన పోలీసులు, స్పెషల్ బ్రాంచ్, కమాండ్ అండ్ కంట్రోల్ సిబ్బంది, బాల్య వివాహాలు అరికట్టిన మహిళా పోలీసులకు ఆయన ప్రశంసా పత్రాలు అందజేశారు.

అత్యాశ అనర్థదాయకం

సైబర్ నేరగాళ్లు అమాయకులను మోసగిస్తూ నగదు కాజేస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా వుండాలని జిల్లా ఎస్పీ కేకేఎన్.అన్బురాజన్ పేర్కొన్నారు. సైబర్ నేరాల నుంచి అప్రమత్తం చేసేందుకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. వాట్సాప్ కాల్స్ ద్వారా హనీ ట్రాప్ (న్యూడ్ వీడియో కాల్స్ ద్వారా బ్లాక్ మెయిల్ చేసి రూ. లక్షలు డియాండ్ చేయడం) చేసి ఇటీవలి కాలంలో అమాయకుల నుంచి రూ. లక్షల్లో డబ్బు డిమాండ్ చేస్తున్నారన్నారు. అపరిచితుల నుంచి వచ్చే వాట్సాప్ కాల్స్‌ను పట్టించుకోవద్దన్నారు. నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్(ఎన్.సి.ఆర్.పి)లో అత్యధికంగా వాట్సాప్ కాల్స్ ద్వారా మోసపోయినట్లు ఫిర్యాదు చేస్తున్నారని జిల్లా ఎస్పీ తెలిపారు.

బహుమతుల పేరుతో..

ఆన్‌లైన్ షాపింగ్ లిమిటెడ్ పేరిట స్క్రాచ్ కార్డులంటూ మరింత మంది మోసం చేస్తున్నారని ఎస్పీ హెచ్చరించారు. తొలుత అమోజాన్, మీషో, నాప్తాల్ పేరిట సైబర్ నేరగాళ్లు మీ ఇంటికి కొరియర్ పోస్టు పంపుతారని, అనంతరం మీరు బహుమతి గెలుచుకున్నారని, తెలుసుకోవడం కోసం ఈ స్క్రాచ్ కార్డును స్క్రాచ్ చేయమని చెబుతారన్నారు. స్క్రాచ్ చేసి అందులో మీకు బహుమతిగా కారు, ఇతర లగ్జరీ వస్తువులు లాటరీ తగిలిందని చెబుతారన్నారు. అనంతరం ఫోన్ చేయాలని నెంబర్ ఇస్తారని, వాటికి కాల్ చేస్తే రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్, డెలివరీ ఛార్జీలంటూ నగదు మొత్తం వసూలు చేస్తారన్నారు. కట్టిన తర్వాత సైబర్ నేరగాళ్లు మొబైల్ ఫోన్ స్విఛాప్ చేస్తారన్నారు. ఇలాంటి వాటి బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. బాధితులు వెంటనే ఎన్.సి.ఆర్.పి పోర్టల్‌లో ఫిర్యాదు చేసేందుకు 1930కు టోల్‌ఫ్రీ కాల్ చేయాలన్నారు.

క్రీడల్లో వైద్య విద్యార్థులు రాణించడం అభినందనీయం

జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్) తుషార్ డూడీ

కడప అర్బన్ : వైద్య విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు క్రీడల్లోనూ రాణించడం అభినందనీయమని జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్) తుషార్ డూడీ అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా కడప ప్రభుత్వ వైద్య కళాశాల(రిమ్స్) ఆడిటోరియం వద్ద మంగళవారం 'స్పోర్ట్స్‌డే' ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన అదనపు ఎస్పీ తుషార్ డూడీకి కోలాటం, సంప్రదాయ నృత్యాలతో 2019 బ్యాచ్ వైద్య విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సమావేశంలో విద్యార్థులనుద్దేశించి తుషార్ డూడీ మాట్లాడుతూ మేజర్ ధ్యాన్‌చంద్ ఒలంపిక్స్‌లో హాకీ క్రీడలో మూడు పతకాలు సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. వైద్య విద్యతోపాటు, క్రీడల్లో ప్రతి ఒక్కరూ రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం అంతర్ జిల్లా కళాశాలలతో జరిగిన క్రికెట్, వాలీబాల్, ఇతర పోటీల్లో గెలుపొందిన వైద్య విద్యార్థులకు ట్రోఫీ, జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సర్వజన వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.సురేఖ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసనాయక్, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.సురేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. కడప రిమ్స్ సీఐ కె.రామచంద్ర, ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి, రిమ్స్ శానిటేషన్ అండ్ సెక్యూరిటీ కాంట్రాక్టర్ జె.బాలనారాయణరెడ్డి, వైద్యులు, వైద్య విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.


వైద్య విద్యార్థులకు ట్రోఫీ అందజేస్తున్న తుషార్ డూడీ, అధికారులు

ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన

అడిషనల్ ఎస్పీ కృష్ణారావు

కడప కోటిరెడ్డి సర్కిల్ : జిల్లాలో ప్రమాదాలు, విపత్తులను సమర్థంగా ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన చర్యలను ప్రయోగాత్మకంగా వివరించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని అదనపు ఎస్పీ కృష్ణారావు, డిప్యూటీ చీఫ్ ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి తెలిపారు. కడప నగర శివారులోని ఐఓసీఎల్ (ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్) బాటలింగ్ ప్లాంట్ ఆవరణలో డీజీఎం ధర్మారావు, సేఫ్టీ మేనేజర్ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం 'ఎమెర్జెన్సీ రెస్పాన్స్ డ్రిల్' కార్యక్రమం నిర్వహించారు. గ్యాస్ నిల్వచేసే ట్యాంకర్లలో మంటలు, ఇతర ప్రమాదాలు సంభవించినపుడు ఎలా ఛేదించాలనే అంశంపై ఎస్‌డీఆర్ఎఫ్, జిల్లా ఫైర్ సేఫ్టీ సిబ్బంది, రెస్క్యూ టీమ్ బలగాలు ప్రయోగాత్మకంగా చేసి వివరించారు. డిప్యూటీ తహసీల్దారు కేపీ. రొనాల్డ్ శ్యామూల్ రాజ్, కడప అగ్నిమాపక అధికారి బసివిరెడ్డి ఇతర అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ ప్రదీప్, రిమ్స్ ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి, ప్లాంట్ మేనేజర్లు సాంబశివరావు, జిలానీబాషా, మెడికల్ ఆఫీసర్ గోపీనాథ్, హెచ్‌పీసీఎల్ డిపో ఇన్‌ఛార్జి మన్మథరావు, సేఫ్టీ ఆఫీసర్ ప్రితీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఐఓసీఎల్ అధికారులు, సిబ్బందికి ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న వివిధ శాఖల ఉన్నతాధికారులు

విధి నిర్వహణకు పునరంకితం కావాలి : జేసీ

కడప సెవెన్‌రోడ్స్ : విధులను అంకిత భావంతో నిర్వర్తించేందుకు పునరంకింతం కావాలని జేసీ గణేష్‌కుమార్ అన్నారు. మంగళవారం జెడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో పంచాయతీ కార్యదర్శుల పునశ్చరణ తరగతుల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఏపీ పంచాయతీరాజ్ చట్టం, ఉద్యోగుల విధి నిర్వహణ-క్రమశిక్షణా చర్యలు, ఉపాధి హామీ పథకం, లే అవుట్ల ఏర్పాటు-అమలు, సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన, జగనన్న శాశ్వత భూహక్కు వంటి అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు. జిల్లాలో మొత్తం 528 మందికి గ్రేడ్-1నుంచి గ్రేడ్-5 వరకుగల పంచాయతీ కార్యదర్శులకు ఈ నెల 30వ తేదీ వరకు శిక్షణ ఇస్తారన్నారు. ప్రతి ఒక్కరూ ఒత్తిడిని తగ్గించుకుని ఉత్తేజితులు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి, డీపీఓ కార్యాలయ ఏఓ ఖాదర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జేసీ గణేష్‌కుమార్

షార్టు టెండరు ప్రకటన

ఆర్.సి. నెం. 9/ఏ-1/2023-24. తేది: 30-08-2023.

మహాత్మా జ్యోతి బాపూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నడుపబడుచున్న వై.ఎస్.ఆర్. కడప జిల్లా, జమ్మలమడుగు, ఒనిపెంట, కమలాపురం, తొండూరు (వేంపల్లి) గల గురుకుల విద్యాసంస్థలకు 2023-24 సం॥నకు కావలసిన 1) కూరగాయలు, 2) అరటిపండ్లు, 3) కోడిగుడ్లు (ఎగ్స్), 4) చికెన్ (స్కిన్ లెస్), 5) స్టేషనరీ, 6) పాలు సేవలు చేయుటకు టెండర్లు కోరబడుచున్నవి. స్టేషనరీకి టెండరు ఫారం ధర Rs.1000/- ఇతర సేవలకు Rs.500/- డి.డి.ని "PRINCIPAL,MJPAPBCWR SCHOOL (Boys), JAMMALAMADUGU" పేరు మీద SBI Jammalamadugu (IFSC Code SBIN0000977) లో మాత్రమే చెల్లుబాటు అగునట్లు తీసుకొనవలెను. టెండరు ఫారములు 01-09-2023 నుండి 07-09-2023 సాయంత్రం 5.గంటల వరకు జమ్మలమడుగు పాఠశాల నుండి ఆఫీసు పనిదినములలో పొందవలెను. తదుపరి టెండరు ఫారములు ఇవ్వబడవు. కడప కలెక్టరేట్ లోటెండరు బాక్స్ 08-09-2023 వ తేదీ ఉదయం గం. 10.30 నిమిషముల నుండి ఉంచబడును. మధ్యాహ్నం 2.00 గంటలకు టెండర్ బాక్స్ సీలు వేయబడును. 08-09-2023 వ తేదీ సాయంత్రం 5.00 గంటలకు టెండరు బాక్సు తెరువబడును. ఇట్టి టెండరును రద్దు పరచుటకు మరియు తేదీ మార్పులు చేయు పూర్తి అధికారము శ్రీయుత సంయుక్త కలెక్టర్ / చైర్మన్ జిల్లా కొనుగోలు కమిటీ, వై.ఎస్.ఆర్ జిల్లా వారికి కలదు. మిగతా వివరాలకు కన్వీనర్ గారిని సంప్రదించగలరు.

ముఖ్య గమనిక:
1. కూరగాయలు మరియు అరటిపండ్లు టెండర్లు పొందిన టెండరుదారుడు తాజా కూరగాయలు మరియు అరటిపండ్లు ప్రతిరోజు ఉదయంమాత్రమే సరఫరా చేయవలెను.
2. టెండర్ల నందు స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వబడును. జిల్లా సంయుక్త కలెక్టర్ వారి ద్వారా జారీ చేయబడినది.

CONVENER & PRINCIPAL,
MJPAPBCWR SCHOOL (B),
JAMMALAMADUGU, YSR KADAPA (D). Cell.No.9885466501.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

పెండ్లిమర్రి : రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నందిమండలం గ్రామ సచివాలయం-1 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించారన్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు రాని వారు ఉంటే తమ దృష్టికి తీసుకు వస్తే అక్కడే అధికారులతో మాట్లాడి పథకాలు వచ్చేలా కృషి చేస్తామన్నారు. అనంతరం గడప గడపకు తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కొందరు రైతు భరోసా, పక్కాగృహాలు, ఇంటి స్థలం లేదని అడిగారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి, ఆగ్రో కార్పొరేషన్ డైరెక్టర్ చావలిశివ, సర్పంచ్ రామమోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రవి, విజయభాస్కర్‌రెడ్డి, వెంకటయ్య, ఎంపీటీసీ సభ్యుడు సురేష్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.


నందిమండలంలో ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

మండల సమాఖ్య నూతన కార్యవర్గం

వీరపునాయునిపల్లె: స్థానిక వీఆర్‌యస్ డిగ్రీ కళాశాలలో శ్రీనిధి ఏరియా జనరల్ మేనేజర్ రమణారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం వీరపునాయునిపల్లె వెలుగు మండల సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల సమాఖ్య అధ్యక్షురాలిగా యరమలపల్లె గ్రామానికి చెందిన అర్చన, ఉపాధ్యక్షురాలిగా చంద్రకళ, కార్యదర్శిగా ప్రవల్లిక, ఉప కార్యదర్శిగా నాగరాణి, కోశాధికారిగా వెంకటలక్ష్మి ఎంపికయ్యారు. ఏరియా కో ఆర్డినేటర్ రఘునాథరెడ్డి, ఏపీఎం భాగ్యమ్మ, సీసీలు, యానిమేటర్‌లు, గ్రామ సమాఖ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నేడు చెక్కులు పంపిణీ

వీరపునాయునిపల్లె: మండలంలోని సర్వరాయసాగర్ ప్రాజెక్టు లీకేజీ వలన దెబ్బతిన్న భూములకు సంబంధించిన రైతులకు నష్ట పరిహారం కింద బుధవారం 10 గంటలకు చెక్కులు పంపిణీ చేయనున్నట్లు మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.

పొలతలలో హుండీ కానుకలు లెక్కింపు

పెండ్లిమర్రి : పొలతల శైవ క్షేత్రంలోని మల్లేశ్వరస్వామి దేవస్థానంలోని హుండీలను మంగళవారం దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకర్‌బాలాజీ ఆధ్వర్యంలో లెక్కింపు నిర్వహించారు. మల్లేశ్వరస్వామి, పార్వతిదేవి, అక్కదేవతలు, పులిబండెన్న స్వాములవారి హుండీ కానుకలను లెక్కించగా రూ.27,61,060 నగదు లభించిందన్నారు. ఆలయ ఈఓ మహేశ్వర్‌రెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షుడు నాగమల్లారెడ్డి పాల్గొన్నారు.


పొలతలలో హుండీ కానుకలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది, భక్తులు

ఆహార విజ్ఞానశాస్త్ర సాంకేతిక కళాశాలలో క్రీడా దినోత్సవం

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని ఆహార విజ్ఞానశాస్త్ర, సాంకేతిక కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎమ్.ఎస్.బేగ్ మాట్లాడుతూ దేశానికి మూడు ఒలంపిక్స్ పతకాలు అందించిన ధ్యాన్‌చంద్ ప్రతిభను కొనియాడారు. ఈ సందర్భంగా స్థానిక యువతతో కళాశాల విద్యార్థులు క్రికెట్ మ్యాచ్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అధ్యాపకులు రాజేష్, నజ్మా, నివేదిత, ఏడుకొండలు, సాయిశ్రీనివాస్, రాజశేఖర్, సుబ్బారెడ్డి, పావనదీప్తి, జయమ్మ, ఎస్.వి.సుబ్బారెడ్డి పాల్గొన్నారు.


జాతీయ క్రీడాదినోత్సవంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

ఆడపిల్లల నిష్పత్తి పెంచేందుకు చర్యలు చేపట్టాలి

వేముల : జిల్లాలో ఆడపిల్లల నిష్పత్తి పెంచే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి రమణమ్మ అన్నారు. మంగళవారం వేముల మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు విద్యార్థులకు పీసీ అండ్ పీఎన్ డీటీ యాక్ట్ 1994 కింద అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో స్త్రీ, పురుషులు ఇద్దరూ సమానమేనని, స్త్రీ పురుషుల మధ్య వివక్ష ఉండరాదన్నారు. పుట్టబోయే బిడ్డ ఆడశిశువు అని తెలియగానే కొన్ని సందర్భాలలో గర్భ స్రావానికి కొన్ని కుటుంబాలు సిద్ధపడుతున్నాయన్నారు. జిల్లాలో ఆడపిల్లల నిష్పత్తి పెంచేందుకు తగిన నిఘా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి స్కాన్ సెంటర్‌ను నెలకు ఒకసారి ప్రోగ్రాం అధికారుల ద్వారా తనిఖీలు చేస్తున్నామన్నారు. జిల్లాలో జరిగిన ప్రతి అబార్షన్ పైన నిఘా ఉంచుతున్నామన్నారు. జిల్లాలో ఎవరైనా లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే వారిని శిక్షార్హులుగా గుర్తిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శారద, ఉపాధ్యాయులు, హెల్త్ ఎడ్యుకేటర్ కళ్యాణి, ఆరోగ్య కార్యకర్త అశ్విని, తదితరులు పాల్గొన్నారు.

ధ్యాన్‌చంద్ నేటి యువతరానికి మార్గదర్శి

వేంపల్లి : స్థానిక శ్రీ చైతన్య ఉన్నత పాఠశాల, నారాయణ ఇంగ్లీషు మీడియం ఉన్నత పాఠశాలల్లో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు ఆ పాఠశాలల కరస్పాండెంట్లు చక్రపాణి రెడ్డి, నారాయణ రెడ్డిలు తెలిపారు. ఈ సందర్భంగా ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ నేటి యువతకు ధ్యాన్‌చంద్ మార్గదర్శి అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


చైతన్య పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవంలో పాల్గొన్న కరస్పాండెంట్, విద్యార్థినులు

ప్రేమజంట ఆత్మహత్య

- సారీ అమ్మా అని సూసైడ్‌నోట్ రాసిన విద్యార్థిని
- రెండు కుటుంబాలలో విషాదఛాయలు

పెద్దమండ్యం : 'సారీ అమ్మా.. ఆదిని నేను మరచిపోలేకున్నా.. ఆదికి సంబంధాలు చూస్తున్నారని తెలిసి నీకు చెబుదాం అనుకున్నా.. నీవు అర్థం చేసుకోలేవని తెలుసు మా.. నిన్ను హర్ట్ చేయడం నాకు ఇష్టం లేదు. మిమ్మల్ని మోసం చేయలేను మా.. ఒకరినిఒకరు వదిలి ఉండలేము.. సో మేము సూసైడ్ చేసుకోవాలని ఫిక్స్ అయినాము. ఐ యామ్ వెరీ సారీమా.. ఆది, నన్ను ఒకటే చోట పూడ్చిపెట్టండి ప్లీజ్.. మా కోసం మీరు ఏమీ గొడవలు పడవద్దు.. మీరు హ్యాపీగా ఉండండి మా.. నేను చేసిన తప్పుకు పనిష్‌మెంట్ ఇది'.. అంటూ సూసైడ్‌నోట్ రాసిన విద్యార్థిని ప్రియుడితో కలిసి తనువుచాలించింది. అన్నమయ్య జిల్లా పెద్దమండ్యం మండలంలోని పాపేపల్లె గ్రామం గొర్లవానికుంటకు సమీపంలోని నడిమిఒడ్డు వంక మొరవ వద్ద మంగళవారం ఈ సంఘటన జరిగింది. వివరాలిలా ఉన్నాయి.

గుర్రంకొండ మండలం సరిమడుగుకు చెందిన ఎలిశెట్టి సుబ్రమణ్యం కుమార్తె సౌమ్య (18) మదనపల్లెలోని ఒక ప్రవేటు కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతోంది. తల్లి మాధవి, తమ్ముడితో కలిసి ఇదే మండలంలోని ఎల్లుట్ల గ్రామం శీలంవారిపల్లెలో అమ్మమ్మ ఇంట్లో ఉంటోంది. కాగా, రాయచోటి మండలం యండపల్లె పంచాయతీలోని బాలిరెడ్డిగారిపల్లెకు చెందిన వేమల రామచంద్ర కుమారుడు సందీప్ అలియాస్ ఆది పెద్దమండ్యం మండలం కలిచెర్ల గ్రామంలోని బాటవారిపల్లెలో అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటూ పాల ఆటో నడిపేవాడు. ఈ క్రమంలో సౌమ్య, ఆదిల మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఆది ఇటీవల ఆర్టీసీ ప్రైవేటు బస్సును మదనపల్లె-కడప మార్గంలో నడిపేవాడు. ఇదిలా ఉండగా, సోమవారం కళాశాల నుంచి శీలంవారిపల్లెకు వచ్చిన సౌమ్య పెద్దమండ్యంలోని తన పెద్దమ్మ ఇంటికి వెళ్లింది. అక్కడి నుంచి ఆమె ఆదితో ద్విచక్రవాహనంలో కలిసి వెళ్లింది. పాపేపల్లె - గోరాన్‌చెరువు మార్గంలోని గొర్లవానికుంటకు సమీపంలో రోడ్డుపై ద్విచక్రవాహనాన్ని నిలిపి సమీపంలోని కానుగచెట్టుకు ఇద్దరు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. సంఘటనతో ఇరు కుటుంబాలలో విషాదం నెలకొంది. అటు ఉన్న ఒక్కగానొక్క కొడుకు మృతిచెందడంతో ఆది కుటుంబ సభ్యులు, ఇటు సౌమ్య కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా రోదించారు.


చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ప్రేమజంట

ఆడబిడ్డ చదువు కోసం కువైట్‌కు వెళ్లి..

సౌమ్య తల్లిదండ్రులు తనబిడ్డ చదువు కోసం తపనపడ్డారు. బిడ్డను బాగా చదివించాలని తల్లి మాధవి కువైట్‌కు వెళ్లింది. ఇటీవల స్వగ్రామానికి తిరిగి వచ్చి మళ్లీ కువైట్‌కు వెళ్లింది. అయితే తన కుమారుని అనారోగ్య కారణాలతో ఒకనెల మాత్రమే ఉండి తిరిగి స్వగ్రామానికి వచ్చింది. మదనపల్లెలో ఓ ప్రవేటు కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరంలో కుమార్తె సౌమ్యను చేర్పించింది. అయితే అక్కడ ఉండటానికి ఇష్టం లేదని రాయచోటిలోని ఓ ప్రవేటు కళాశాలలో చేరతానని తల్లి వెంట సోమవారం ఇంటికి వచ్చింది. తన పెద్దమ్మ దగ్గరికి పెద్దమండ్యం వెళ్లి ప్రియుడితో కలిసి అఘాయిత్యానికి పాల్పడింది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సూసైడ్‌నోట్‌ను, విద్యార్థిని బ్యాగ్‌ను, ఇరువురి వద్ద ఉన్న సెల్‌లను స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం కోసం మృతదేహాలను మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

తీగ లాగితే డొంక కదులుతోంది?

- మండలంలోని ఒక సంఘమిత్రకు సంబంధించి రూ.6 లక్షల నిధులు దుర్వినియోగమైనట్లు ఆరోపణలు రావడంతో వాటిని దిగమించిన ఓ అధికారి ఈ నెల 3వ తేదీన చెక్కు రూపంలో రూ.3.20 లక్షలు జమ చేసినట్లు తెలిసింది.
- మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాల్సిన అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. వేల రూపాయలు సొంతానికి వినియోగించుకున్నట్లు ఆడిట్ లెక్కల్లో తేలడం ఇందుకు అద్దం పడుతోంది. తీగ లాగితే డొంక కదిలి వారి గుట్టురట్టయింది.

పెద్దతిప్పసముద్రం : వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయ పరిధిలో మహిళా సంఘాల లావాదేవీలు నిర్వహించే సంఘమిత్రల చేతివాటం, పక్కదారి పట్టిన నిధుల వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. మండలంలో 34 గ్రామ సమాఖ్యలకు 37 మంది సంఘమిత్రలుగా వ్యవహరిస్తున్నారు. నాలుగు గ్రామ సమాఖ్యల్లో నిధులు గుట్టుగా పక్కదారి పట్టినట్లు సమాచారం. సంఘాల్లోని ఒక్కో సభ్యురాలికి రూ.50 వేల రుణంమంజూరు చేశారు. వీరు ప్రతినెలా సభ్యుల నుంచి రికవరీ నుంచి సొమ్ములో సగ భాగం జమ చేసి మిగిలిన సొమ్మును కాజేశారని తెలుస్తోంది. పట్టంవాండ్లపల్లి, బూచిపల్లి, తుమ్మరకుంట, కందుకూరు, రంగసముద్రం, పులికల్లు, మరో మూడు గ్రామ సమాఖ్యల పరిధిలోనూ ఇదే విధంగా చేశారనే ఆరోపణలు దావనంలా వ్యాపించడంతో మహిళలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అంతేగాక సదరు సంఘమిత్ర నిర్లక్ష్య ధోరణిపై గ్రామ సమాఖ్య పరిధిలోని 29 సంఘాల గ్రూపు సభ్యులంతా మూకుమ్మడిగా ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఆమెను తొలగించి కొత్త వ్యక్తిని సంఘమిత్రగా నియమించినట్లు తెలుస్తోంది. ఆడిట్ అధికారులు సక్రమంగా తనిఖీలు చేస్తే మరిన్ని విషయాలు వెలుగుచూస్తాయని మహిళలు చెబుతున్నారు.

దేశభాషలందు తెలుగు లెస్స!

తెలుగుభాషా దినోత్సవాన్ని మంగళవారం పలు విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. వ్యావహారిక భాషోద్యమకర్త గిడుగు రామమూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు భాష గొప్పదనాన్ని వక్తలు వివరించారు.



వేంపల్లి : సమావేశంలో మాట్లాడుతున్న అధ్యాపకురాలు



కమలాపురం : తెలుగు తల్లి, రామమూర్తి చిత్ర పటాలకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయ బృందం

ఘనంగా తెలుగుభాషా దినోత్సవం

జమ్మలమడుగు రూరల్ (మైలవరం): ప్రపంచ భాషల్లో కెల్లా తెలుగు భాష అతి మధురమైన భాష అని మైలవరం ఎంపీడీఓ వై. రామచంద్రా రెడ్డి అన్నారు. మంగళవారం మైలవరం మండలంలోని వేపరాల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు జి. బాలయ్య అధ్యక్షతన తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి ఆధునిక కాలంలో పరాయి భాష మోజులో పడి నేటి యువత తెలుగును విస్మరిస్తున్నారని తెలిపారు. అనంతరం విశ్రాంత ఎంఈఓ మస్తాన్ రెడ్డి మాట్లాడుతూ మాతృభాషను ఎవరూ మరిచిపోరాదన్నారు. కార్యక్రమం అనంతరం మండల స్థాయి వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేసి, తెలుగు ఉపాధ్యాయులను సన్మానించారు.

ఎర్రగుంట్ల : తెలుగు భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవాన్ని , మేజర్ ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా క్రీడాదినోత్సవాన్ని ఆర్టీపీపీలోని డీఏవీ స్కూల్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు మాట్లాడుతూ తెలుగు భాషా ఔన్నత్యాన్ని కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాతృభాషతో వ్యక్తిత్వ వికాసం

వేంపల్లి : మాతృభాష వల్ల మనుషుల్లో వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యం, సృజనాత్మక శక్తి పెరుగుతుందని తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ రమ్యజ్యోతి పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని తెలుగు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగు భాష వారోత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రాంధిక భాషగా చలామణి అవుతూ సామాన్య ప్రజలకు క్లిష్టమైన భాషగా ఉన్న తెలుగు భాషను ప్రజల వాడుక భాషగా మార్చిన ఘనుడు గిడుగు వెంకటరామమూర్తి అన్నారు. తెలుగు జాతి అభివృద్ధికి గిడుగు చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన తెలుగుశాఖ అధిపతి డాక్టర్ నాగలక్ష్మిదేవి మాట్లాడుతూ సూర్యరశ్మి ఉన్నంత కాలం మానవ మనుగడ సాగినట్లే తెలుగుజాతి అభివృద్ధికి తెలుగు భాష చాలా ముఖ్యమన్నారు. వైస్ ప్రిన్సిపల్ నాగేంద్ర మాట్లాడుతూ మాతృభాష ప్రతి ఒక్కరిలో జిజ్ఞాసను పెంచుతుందని, ప్రతి ఒక్కరూ మాతృభాష పట్ల మక్కువ చూపాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల లైబ్రేరియన్ మాధవరావు, అధ్యాపకులు డాక్టర్ సతీష్, అరవింద్, డాక్టర్ ఓబుల్‌రెడ్డి, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ మల్లీశ్వరి, కిరణ్మయి, ఆస్మా సిద్దిక్, విద్యార్థులు పాల్గొన్నారు.

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో గిడుగు వెంకట రామమూర్తి జయంతి వారోత్సవాల్లో భాగంగా మంగళవారం తెలుగు భాషాదినోత్సవం ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశ్రాంత అధ్యాపకులు, కవులు సారెడ్డి చంద్రశేఖర రెడ్డి, పాశం లక్ష్మి నారాయణలు హాజరయ్యారు. లక్ష్మినారాయణ మాట్లాడుతూ తెలుగు సాహిత్య ఔన్నత్యాన్ని ప్రశంసించారు. చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ అమ్మ భాష అమృత భాషని, వ్యవహార భాష కోసం తన జీవితాన్ని అర్పించిన గిడుగు పిడుగన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం కళాశాల సిబ్బంది అతిథులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సుధీర, పీఆర్ఓ డాక్టర్ బాలనారాయణ, తెలుగు విభాగాధిపతి డాక్టర్ కె.విజయలక్ష్మి, డాక్టర్ శ్రీనీత, అధ్యాపకులు హేమవతి, రెడ్డెమ్మ, వాణి, గంగిరెడ్డి, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

తెలుగు భాషను ఇంటింటా ఆదరించాలి

కమలాపురం : తెలుగు భాషను ఇంటింటా ఆదరించాలని, మాతృభాష మన సంస్కృతీ, సంప్రదాయాలకు పట్టుకొమ్మ అని పెద్దచెప్పలి జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం ఓబుల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలుగు తల్లి, గిడుగు రామమూర్తి చిత్ర పటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి చోట తెలుగు వెన్నెలై వెలగాలని, సిరి నవ్వులై కురవాలని, మనోహరంగా వికసించాలన్నారు. పద్యం, ఛందస్సు, అవధానం, సామెతలు, జాతీయాలు తెలుగు భాషకు మాత్రమే సొంతమన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డీకే చదువుల బాబు మాట్లాడుతూ మన తెలుగు సాహితీ సంపదను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. మాతృభాషపై పట్టు ఉన్న ప్రతి విద్యార్థి అన్ని భాషలను సులభంగా అభ్యసించగలరన్నారు. తెలుగు భాషోపాధ్యాయులు శ్రీకాంత్, రాజశేఖర్ రెడ్డి మాట్లాడారు. అనంతరరం నిర్వహించిన ఛాయా చిత్రాల ప్రదర్శన అలరించింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే కమలాపురంలోని సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవ, జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

తేనెలొలుకు భాష తెలుగు

జమ్మలమడుగు : పాశ్చాత్యులు సైతం తెలుగు భాషా గొప్పతనాన్ని కీర్తించడంతో పాటు ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ అంటూ గొప్పగా తెలుగుభాషను అభివర్ణించారని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం కళాశాలలో తెలుగుభాషా దినోత్సవంతోపాటు క్రీడాదినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలోవైస్ ప్రిన్సిపల్ సంజీవరెడ్డి, పీడీ షఫీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

తెలుగు భాషకు ఆధునికత నేర్పిన గిడుగు



పెండ్లిమర్రిలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్

పెండ్లిమర్రి : తెలుగు భాషకు ఆధునికతను నేర్పిన భాషా సంస్కర్త గిడుగు వెంకట రామమూర్తి అని పెండ్లిమర్రి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ అన్నారు. పెండ్లిమర్రి డిగ్రీ కళాశాలలో మంగళవారం తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుశాఖాధ్యక్షురాలు రమ్యజ్యోతి, అధ్యాపకులు చెంద్రాయుడు, ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.



జమ్మలమడుగు: సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్



ఎర్రగుంట్ల:ఆర్టీపీపీలో తెలుగు భాషా దినోత్సం సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన



పులివెందుల టౌన్:అతిథులను సన్మానిస్తున్న అధ్యాపకులు



జమ్మలమడుగు రూరల్:తెలుగు భాషా దినోత్సవంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

2వేల మందికి ఉపాధి కల్పించడమే లక్ష్యం

పులివెందుల రూరల్ : పులివెందుల ప్రాంతంలోని 2వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ఆదిత్యా బిర్లా కంపెనీని ఏర్పాటు చేశారని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని పెద్దరంగాపురం గ్రామ సమీపంలో ఉన్న ఏపీకార్ల్ భవనంలో ప్రారంభమైన ఉత్పత్తులను మంగళవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం తాత్కాలిక భవనంలో 500 మంది మహిళలతో ఆదిత్యా బిర్లా కంపెనీ ఉత్పత్తులు ప్రారంభించారన్నారు. ఈ కంపెనీలో ప్రఖ్యాతి గాంచిన లూయిస్ ఫిలిఫ్ వాన్ హ్యూసెన్, పీటర్ ఇంగ్లాండ్ వంటి బ్రాండులకు సంబంధించిన రెడీమేడ్ దుస్తులు తయారు చేయడం గర్వంగా ఉందన్నారు. ఇక్కడ పనిచేస్తున్న మహిళా ఉద్యోగులతో మాట్లాడి ఏవైనా సమస్యలున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఆదిత్యా బిర్లా కంపెనీ మేనేజర్ జయకుమార్ మాట్లాడుతూ కంపెనీ ప్రారంభంలో 500 మంది మహిళా ఉద్యోగులతో ఉత్పత్తులను ప్రారంభించడం ఆదిత్యాబిర్లా కంపెనీ చరిత్రలో ఇదే ప్రథమమన్నారు. ఇందుకు సహకరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కోడిరమణ, పార్నపల్లె కిశోర్, కంపెనీ పీఆర్వో కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.




కంపెనీలో తయారవుతున్న దుస్తులను పరిశీలిస్తున్న వైఎస్ మనోహర్ రెడ్డి, వరప్రసాద్

అభివృద్ధి పనుల పరిశీలన

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ పరిశీలించారు. మంగళవారం వారు వైస్ చైర్మన్ హఫీజుల్లా, కమిషనర్ నరసింహారెడ్డిలతో కలిసి స్థానిక చెన్నారెడ్డి కాలనీలో పర్యటించి అభివృద్ధి పనుల్లో భాగంగా వేసిన సిమెంట్ రోడ్లను, భూగర్భ డ్రైనేజీ పనులను పరిశీలించారు. కాలనీలో ఇంకా ఎక్కడైనా రోడ్లు వేయాల్సి ఉంటే తక్షణమే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి అజయ్ కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్, తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయంపై దృష్టి పెట్టాలి

వీరపునాయునిపల్లె : ప్రతి రైతు ఆధునిక వ్యవసాయంపై దృష్టి పెట్టాలని మండల అధ్యక్షుడు కల్లూరు రఘునాథరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో నీటియాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో ఆధునిక వ్యవసాయంపై రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పాత వ్యవసాయ పద్ధతులకు స్వస్తి చెప్పి నూతన వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని సూచించారు. తక్కువ ఖర్చుతో అధిక లాభాలు ఆర్జించే విధంగా సాగు చేయాలన్నారు. అనంతరం ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సాయి మహేశ్వరి, ప్రశాంతి రైతులకు పలు సూచనలు అందించారు. ఈ ఏడాది జూన్, జూలై మాసాల్లో కురవాల్సిన వానలు కురవక పోవడంతో వర్షపాతం చాలా తక్కువగా నమోదైందన్నారు. తక్కువ రోజుల్లో కోతకు వచ్చే పంటలు, బెట్ట పరిస్థితులను తట్టుకోగలిగే పంటలు, తక్కువ సాగు ఖర్చుతో కూడుకున్న పంటలను సాగు చేసేందుకు ప్రయత్నించాలని పేర్కొన్నారు. కంది, అలసంద, అనప, ప్రొద్దుతిరుగుడు, పెసర, సజ్జ లాంటి పంటలను అధికంగా సాగు చేయాలని తెలిపారు. పంట సాగు చేసిన తరువాత అంతర కృషి చాలా ముఖ్యమైనదన్నారు. ఈ కార్యక్రమంలో నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు అధికారి కళ్యాణి, కో ఆర్డినేటర్ మద్దిలేటి, ఉపాధి హామీ పథకం ఏపీఓ వెంకటసుబ్బయ్య, రైతులు పాల్గొన్నారు.



రైతు శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించండి

కమలాపురం : అర్హులైన యువతీ యువకులందరికి ఓటు హక్కు కల్పించాలని ఈఆర్ఓ చంద్రమోహన్ సూచించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు, అన్ని మండలాల తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే బీఎల్వోలు ఇంటింటికి తిరిగి ఓటరు జాబితా పరిశీలన సర్వే పూర్తి చేశారన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారుల సహకారంతో తప్పులు లేని ఓటరు జాబితాను తయారు చేస్తామన్నారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని సూచించగా పలు గ్రామాల్లో బీఎల్వోలు ఇంటింటికి తిరగనేలేదని పలువురు నాయకులు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన బీల్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉత్తమారెడ్డి, ఎస్సీ పుల్లారెడ్డి, సుమిత్రా రాజశేఖర్ రెడ్డి, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసి చూపిస్తున్నాం

చక్రాయపేట : ముఖ్యమంత్రి జగనన్న, ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డిలతో కలసి మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తున్నామని మండల ఇన్‌చార్జి వైఎస్ కొండారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఇడుపులపాయలోని వైఎస్ఆర్ అతిథి గృహం వద్ద తనను కలిసిన మండల నేతలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో మాట్లాడారు. ఇప్పటికే మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపామన్నారు. ఇంకా ఎక్కడైనా చిన్నచిన్న సమస్యలు ఉంటే వాటిని కూడా పరిష్కరిస్తామని చెప్పారు. మండల సమన్వయకర్త ఓబుళరెడ్డి, ఎంపీపీ మాధవీబాలకృష్ణ, మండల జేసీఎస్ కన్వీనర్ రామాంజులరెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

రక్షక తడులతో వేరుశనగ పంటను కాపాడుకోవాల్సిందే

చక్రాయపేట: వర్షాలు లేక ఎండుముఖం పడుతున్న వేరుశనగ పంటకు రైతులు రక్షక తడులు పెట్టి కాపాడుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన కేవీకే శాస్త్రవేత్త వీరయ్య, డాట్ సెంటర్ శాస్త్రవేత్త మురళీకృష్ణతో కలసి మండలంలోని నెర్సుపల్లె గ్రామంలో ఎండుముఖం పట్టిన వేరుశనగ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ వర్షాలు లేక దెబ్బతింటున్న పంటను వదిలేస్తే చెదలు పట్టే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఏడీఏలు మాధవి, అశోక్‌రెడ్డి మండల వ్యవసాయ అధికారి నవంత్‌బాబు, వ్యవసాయ సహాయకులు రైతులు పాల్గొన్నారు.

ఎంపీ చొరవతో ఆలయానికి పూర్వ వైభవం

సింహాద్రిపురం : సింహాద్రిపురం మండలం రావులకొలను పంచాయతీ పరిధిలో ఉన్న అహోబిలపురం గ్రామంలో ఎంతో పురాతనమైన చెంద్రాయుని ఆలయం పూర్వ వైభవం సంతరించుకుంది. ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి చొరవతో నూతన ఆలయం నిర్మించి గురువారం నుంచి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు సోమశేఖర్ రెడ్డి తెలిపారు. మూడు రోజుల పాటు ఈ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పాల్గొంటారని తెలిపారు.

ఆడుదాం ఆంధ్ర పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎర్రగుంట్ల : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ఆడుదాం ఆంధ్ర పోటీలను యర్రగుంట్ల పట్టణంలో నందు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ పి.జగన్నాథ్ తెలిపారు. ఈ పోటీలకు ఆసక్తి కల్గిన క్రీడాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. అక్టోబర్ 2వ తేదీ నుంచి పట్టణ స్థాయి, మండల స్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తారన్నారు. ఇందులో క్రికెట్, ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 15 సంవత్సరాలు నిండిన ఆసక్తి కల్గిన పురుషులు, మహిళలు క్రీడల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.